క్లుప్తంగా

హెల్మెట్ తప్పనిసరి


డీఎస్పీ లక్ష్మయ్య

దెందులూరు: హైకోర్టు ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేనిచో ఎంవీఆర్ యాక్ట్ ప్రకారం జరిమానా లేదా మోటార్ సైకిల్ సీజ్ చేస్తామని డీఎస్పీ జి.లక్ష్మయ్య అన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇస్తే సీజ్ చేయడంతో పాటు తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు. వారం రోజులు పాఠశాలలు, కళాశాలలు, శిక్షణా కేంద్రాల్లో పూర్తి స్థాయి అవగాహన కల్పించేందుకు అన్ని మండలాల్లో తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్సైలతో కలిసి సమిష్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్లెక్సీలతో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. హెల్మెట్ లేని ప్రయాణం, రోడ్డు ప్రమాదాలు వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యుల జీవన విధానంపై ప్రజలకు ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు వివరించాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ పథకాలు నూరు శాతం సత్ఫలితాలు సాధిస్తాయన్నారు. సమావేశంలో పెదవేగి సీఐ కె.శ్రీనివాస కుమార్, పెదపాడు, దెందులూరు, పెదవేగి ఎస్సైలు శుభాకర్, కె.స్వామి, రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సంఘస్తుల శ్రమదానం


శ్రమదానం చేస్తున్న కోర్ ఆఫీసర్ కె.రమణయ్య, సంఘస్తులు

దెందులూరు: ఆధ్యాత్మిక అభివృద్ధికి సాల్వేషన్ ఆర్మీ నూతన చర్చి నిర్మాణానికి సంఘస్తులు శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా సాల్వేషన్ ఆర్మీ దెందులూరు కోర్ ఆఫీసర్ మేజర్ కె.రమణయ్య వారిని అభినందించారు. శుక్రవారం గౌడ వీధిలో నూతనంగా నిర్మిస్తున్న సాల్వేషన్ ఆర్మీ చర్చికి సంఘస్తులు ప్రహరీ గోడ నిర్మాణానికి స్వచ్ఛందంగా పాల్గొని సేవలందించారు. సంఘస్తులను కోర్ ఆఫీసర్, సంఘ పెద్దలు ప్రశంసించారు.

ఆత్మ విశ్వాసమే ఆయుధం


మోటివేషన్ క్లాసులో మెళకువలు తెలుపుతున్న సైకాలజిస్టు సుబ్బారావు

ఉంగుటూరు: విద్యార్థులకు ఆత్మ విశ్వాసమే ఆయుధమని, అప్పుడే పరీక్షల్లో విజయం సాధిస్తారని సైకాలజిస్టు సుబ్బారావు అన్నారు. కైకరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు నిర్వహించారు. హెచ్ఎం ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్య నిర్దేశం చేసుకొని ఆత్మ విశ్వాసంతో ముందుకెళ్లాలని సూచించారు. అనంతరం 5 రకాల అంశాలపై శిక్షణ ఇచ్చారు. అల్లూరి సీతారామరాజు జయంతికి నిర్వహించిన వ్యాస రచన, చిత్ర లేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అతిసార నియంత్రణపై అవగాహన


దెందులూరులో అతిసారపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

దెందులూరు: అతిసార వ్యాధి ప్రబలకుండా ముందస్తు చర్యలపై అంగన్‌వాడీలకు, ఆశా కార్యకర్తలకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దెందులూరు ఎంపీడీఓ వీ.శ్రీలత, ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్‌లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛమైన వేడి ఆహారం తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. మురికి గుంటలు, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. గాలాయగూడెంలో పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఉంగుటూరు: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కైకరంలో ఉచిత వైద్య శిబిరాన్ని ధర్మరాజు ప్రారంభించారు. తణుకు నిమ్మగడ్డ అచ్యుత రామయ్య ఎముకల హాస్పిటల్, ఏలూరు శంకర నేత్రాలయం వారిచే రోగులకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. శిబిరంలో 200 మందికి వైద్య సేవలు అందజేశారు. సూర్య మెడికల్స్ అధినేత శివ కుమార్ ఉచితంగా మందులు అందజేశారు. వీఎస్ డయాగ్నస్టిక్స్ ఆధ్వర్యంలో ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. జెడ్పీటీసీ జయలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ చింతల వాసు, గ్రామ సర్పంచ్ సలగాల గోపి, ఎంపీటీసీలు సత్యవేణి, గంటసాల తిరుపతిరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పాతూరి విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీపై శీతకన్ను

పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారులు


కాలనీ రోడ్లపై నిలిచిన వర్షపు నీరు


రోడ్డుపై బోల్తా కొట్టిన ట్రాక్టర్

భీమడోలు: గుండుగొలను జగనన్న కొత్త కాలనీపై అధికారులు శీతకన్ను వేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లపై నీరు ప్రవహించడంతో కాలనీవాసుల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. దీంతో ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్ వంటి వాహనాలు సైతం అదుపు తప్పి బోల్తా కొడుతున్నాయి. మండలంలో గుండుగొలను జగనన్న మెగా కాలనీలో సుమారు 786 గృహాల్లో 530 గృహాల నిర్మాణాలు సాగుతున్నాయి. వాటిలో 70 శాతం గృహాల నిర్మాణం పూర్తయింది. అయితే ఇటీవల హౌసింగ్ అధికారుల నిర్లిప్తత కారణంగా కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం వచ్చిందంటే ఇంటిలోంచి బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. డ్రైనేజీ సదుపాయం కల్పిస్తే వర్షపు నీరు రోడ్లపైకి రాకుండా ఉంటుందని కాలనీ వాసులు అంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలని వారంతా కోరుతున్నారు. కాలనీలో రోడ్లు వేసేందుకు రూ.72 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఏదిఏమైనా రోడ్లపై ఏర్పడిన గోతులను పూడ్చేందుకు అధికారులు శ్రద్ధ వహించాలని కాలనీ వాసులు వేడుకుంటున్నారు.

ఆ రంగులు హానికరం


చికెన్‌కు వేసిన ఎరుపు రంగులు


టేస్టింగ్ సాల్ట్

- వాడకం పెరిగిన టేస్టింగ్ సాల్ట్
- ముంచుకొస్తున్న వ్యాధులు

దెందులూరు: పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా నూడిల్స్ బళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లలో చికెన్‌కు ఎరుపు రంగు వేయడం టేస్టింగ్ సాల్ట్ వాడకం అధికమైంది. కిలోమీటరుకు రెండు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, నూడిల్స్ బళ్లు, హోటల్స్ ఉన్నాయి. విద్యార్థులు ఫాస్ట్‌ఫుడ్‌ను అధికంగా తింటున్నారు. అనేక రకాల పదార్థాల్లో టేస్టింగ్ సాల్ట్ వాడుతున్నారు. చికెన్‌కు ఎరుపు రంగు వేయడం వల్ల అల్సర్, క్యాన్సర్ వంటి వ్యాధులు సంభవిస్తున్నాయి. టేస్టింగ్ సాల్ట్ వల్ల బ్రెయిన్‌కి ప్రమాదం ముంచి ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులు ఈ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లను తనిఖీలు చేసి పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

మానసిక ఒత్తిడిపై అవగాహన సదస్సు


గోపన్నపాలెం వ్యాయామ కళాశాలలో మానసిక ఒత్తిడిపై మాట్లాడుతున్న వైద్యులు

దెందులూరు: ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ మంచి ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు కాకుండా ఉండాలని ఏలూరు సర్వజన వైద్యశాల మానసిక వైద్య నిపుణులు డాక్టర్ వంశీకృష్ణ, సైకాలజిస్టు డాక్టర్ సాయికుమార్ అన్నారు. శుక్రవారం గోపన్నపాలెం వ్యాయామ ప్రభుత్వ విద్యా కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. నత్తానియేలు ఆధ్వర్యంలో మానసిక ఒత్తిడిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పిల్లల మానసిక స్థితిపై తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్యులకు ప్రిన్సిపల్ డాక్టర్ నత్తానియేలు జ్ఞాపికలను అందజేసి సత్కరించారు.

బడిఈడు చిన్నారుల గుర్తింపు


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో వి.శ్రీలత, ఎంఈవోలు

దెందులూరు: బడిఈడు చిన్నారులు తప్పనిసరిగా విద్యాభ్యాసం కోసం పాఠశాలలో చేరాలని దెందులూరు ఎంపీడీవో వి.శ్రీలత, ఎంఈవోలు ఏవీఎస్‌వీ ప్రసాద్, కె.అన్నమ్మ అన్నారు. శుక్రవారం దెందులూరు ఎంపీడీవో కార్యాలయంలో గాలాయగూడెంలో బడికి వెళ్లకుండా వీధుల్లో తిరుగుతున్న నలుగురు చిన్నారులను గుర్తించారు. వెంటనే వారిని ఇంటికి తీసుకువెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఎంపీడీఓ వీ.శ్రీలత సూచన మేరకు చిన్నారులు, తల్లిదండ్రులను ఎంపీడీఓ కార్యాలయానికి తీసుకువచ్చారు. చిన్నారులకు, తల్లిదండ్రులకు ఎంపీడీఓ, ఎంఈఓలు గంటసేపు కౌన్సిలింగ్ ఇచ్చారు. శనివారం నుంచి పాఠశాలకు వెళ్లామని చిన్నారులు అధికారులకు తెలిపారు. గాలాయగూడెం పాఠశాల హెచ్ఎంకు ముగ్గురు చిన్నారులకు అడ్మిషన్ ఇవ్వాలని ఎంఈఓ సూచించారు.

బాలికల పాఠశాలలో ఎస్పీఎల్ ఎన్నికలు


ఓటరు వేలుపై సిరా చుక్క వేస్తున్న ఉపాధ్యాయుడు


ఎన్నికల తీరును పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

ఏలూరు రూరల్ : ఏలూరు కస్తూరిబా ప్రభుత్వ బాలికల పాఠశాల హెచ్ఎం జి.సునీత ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం ఎస్పీఎల్ ఎన్నికలు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎలక్షన్ కమిషన్ చేపట్టే విధి విధానాల మాదిరిగా ఇక్కడా నిబంధనలు అమలు చేశారు. హెచ్ఎం 10 రోజుల ముందుగా ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదల చేశారు. నామినేషన్లు, డిపాజిట్ స్వీకరణ, ఉపసంహరణ, స్క్రూటినీ చేపట్టారు. తర్వాత అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, ప్రచారానికి అవకాశం కల్పించారు. తర్వాత పోలింగ్ నిర్వహించారు. ఓటర్లు మాదిరిగా విద్యార్థుల వేలుపై సిరా చుక్క వేసి ఎన్నికల ముగించారు. తర్వాత కౌంటింగ్ నిర్వహించి, గెలుపొందిన ఎస్పీఎల్‌తో హెచ్ఎం ప్రమాణ స్వీకారం చేయించారు. దీంతో విద్యార్థులు హర్షం వెలిబుచ్చారు.

బీసీలు రాజకీయంగా, ఆర్థికంగాఎదగాలి


సినీనటుడు సుమన్‌కు వెంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లోనూ ఎదగాలని ప్రముఖ సినీ నటుడు సుమన్ అన్నారు. ఏలూరులో ఒక సినిమా షూటింగ్‌లో పాల్గొనేందుకు విచ్చేసిన సుమన్‌ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలువురు బీసీ నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు శుక్రవారం కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ బీసీలు అన్ని పార్టీల్లో ఉండాలని, ఇదే సమయంలో బీసీ కులాల్లో రాజకీయాలు ఉండకూడదని సూచించారు. బీసీలంతా కలిసికట్టుగా ఐక్యతతో పనిచేయాలన్నారు. బీసీలు ఏ రాజకీయ పార్టీలో ఉన్నా తమ హక్కులను పోరాడి సాధించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని చెప్పారు. ప్రధానంగా విద్య, రాజకీయ, ఆర్థికంగా బీసీలు ఎదిగినప్పుడే బీసీలు అభివృద్ధి పథంలో పయనించేందుకు వీలు ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా బీసీలకు చెందిన పలు సమస్యలపై ఆయన అనేక విషయాలను బీసీ నాయకులతో ముచ్చటించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి, నూరు బాషా రాష్ట్ర అధికార ప్రతినిధి గాజుల బాజీ, సామాజిక కార్యకర్త చప్పిడి సత్యనారాయణ, యాదవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఆర్ విఠల్ కుమార్, జిల్లా కన్వీనర్ పామర్తి యేసురాజు, తూర్పుకాపు సంఘం నాయకుడు అప్పిరెడ్డి రంగ ముత్యాలు, వెంకట్రావు, బోయిన కేదారేశ్వరరావు, కొత్తల శివకుమార్, రాజేష్, బీసీ నాయకులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే చర్యలు


అన్నపూర్ణ సీడ్స్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

పెదపాడు: నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ డీ విజయప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం పెదపాడు మండలంలోని అన్నపూర్ణ సీడ్స్‌ను విజిలెన్స్ సీఐ యుజే విల్సన్‌తో కలిసి విజయప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనాలు, రికార్డులు, క్వాలిటీ, స్టాక్ రిజిష్టర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సహాయ సంచాలకులు వై సుబ్బారావు, మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష


ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఉంగుటూరు: డ్రెయిన్ల స్థితిగతులపై ఇరిగేషన్ శాఖ అధికారులతో ఉంగుటూరు ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉంగుటూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ సమీక్షలో ఇరిగేషన్ డ్రెయిన్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే వర్షాకాలం నేపథ్యంలో మురుగు కాలువల పరిస్థితిపై సంబంధిత అధికారులతో చర్చించారు. డ్రెయిన్‌లలో చెత్తా చెదారాలను తొలగించి వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జాగ్రత్తలతోనే అంటు వ్యాధులు దూరం


అంటువ్యాధులపై అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌వో విల్సన్

గణపవరం: మారుతున్న వాతావరణ పరిస్థితులు అంటువ్యాధుల వ్యాప్తికి అనుకూలమని ప్రతీ ఒక్కరూ జాగ్రత్తలు పాటించి వ్యాధులకు దూరంగా ఉండాలని గణపవరం పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్ అన్నారు. శుక్రవారం గణపవరం–3 సచివాలయ పరిధిలో స్టాప్ డయేరియా, డెంగ్యూ నివారణ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డయేరియా వచ్చిన వారు అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యసేవలు పొందాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని, క్లోరినేషన్ చేసిన నీటినే తాగాలని, వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చేబ్రోలు పోలీసులకు రివార్డు


పోలీసులకు రివార్డు చెక్‌లను అందజేస్తున్న ఎస్పీ డి.మేరీ ప్రశాంతి

దెందులూరు/ఏలూరు (టూటౌన్): పేకాట శిబిరంపై దాడి చేసి భారీ ఎత్తున నగదును పట్టుకున్న కేసుకు సంబంధించి కోర్టు అందించిన రివార్డు సొమ్మును చేబ్రోలు పోలీస్ స్టేషన్ సిబ్బందికి ఎస్పీ మేరీ ప్రశాంతి శుక్రవారం తన కార్యాలయంలో అందజేశారు. 2023, జనవరి 16న చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంగుటూరు మండలం కంసాలిగుంటలో పేకాట శిబిరంపై దాడి చేసి పేకాట ఆడుతోన్న 23 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు 8.45 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి 23 మంది ముద్దాయిలను 2023, డిసెంబరు 29న కోర్టులో హాజరు పరచగా న్యాయస్థానం ఒక్కొక్కరికి రూ.300 జరిమానా విధించారు. ఈ క్రమంలో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించిన చేబ్రోలు పోలీస్ స్టేషన్ సిబ్బందికి కోర్టు రూ.1.65 లక్షలు రివార్డు ఇచ్చింది. కోర్టు నుంచి వచ్చిన చెక్కులను పోలీస్ సిబ్బందికి ఎస్పీ డి.మేరీ ప్రశాంతి శుక్రవారం అందజేశారు. అప్పటి చేబ్రోలు ఎస్సై స్వామి, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

నేడు ఉచిత రేబిస్ టీకాల కార్యక్రమం


భీమడోలులో విలేకరులతో మాట్లాడుతున్న ఏడీ ఇక్కుర్తి సాయిరమేష్

భీమడోలు: జూనోసిస్ డేను పురస్కరించుకుని శనివారం భీమడోలు ప్రాంతీయ పశు వైద్యశాలలో శునకాలకు ఉచిత రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు భీమడోలు పశు సంవర్ధక శాఖ ఏడీ ఇక్కుర్తి సాయి రమేష్ అన్నారు. భీమడోలులో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాంతీయ ఆసుపత్రి పరిధిలో భీమడోలు, ద్వారకాతిరుమల, ఉంగుటూరు, నిడమర్రు మండలాల్లోని పశువైద్య శాలల వద్ద ప్రభుత్వ ఉచిత రేబిస్ టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పశువుల నుంచి మనుష్యులకు సోకే రేబిస్, అదే విధంగా మనుషుల నుంచి పశువులకు సోకే వ్యాధుల నిర్మూలనకు వ్యాక్సినేషన్ చేపడుతున్నామన్నారు. రేబిస్ వ్యాధి నిర్మూలనకు శాస్త్రవేత్త లూయి పాశ్చర్ జూలై 6న తొలిసారిగా రేబిస్ వ్యాక్సిన్ వేసి అదుపులోకి తెచ్చారన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకొని ఈ నెల 6న జూనోసిస్ డేగా జరుపుకుంటామన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆసుపత్రుల్లో వ్యాక్సినేషన్ వేస్తామన్నారు. పెంపుడు కుక్కలు, పశువులను సంబంధిత యాజ మానులు ఆసుపత్రికి తీసుకొచ్చి టీకాలు వేయించుకోవాలన్నారు. ఈ రేబిస్ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల కుక్క కాటుకు గురైన వ్యక్తికి ఎటువంటి ప్రమాదం ఉండదన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపు నిచ్చారు.

నేడు పెంపుడు కుక్కలకు టీకాలు

పెదపాడు: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెదపాడు పశువుల ఆస్పత్రిలో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్నట్లు పశువైద్యాధికారి వాణి సంధ్యశ్రీ తెలిపారు. శనివారం ఉదయం ఉచితంగా వ్యాక్సిన్‌లు వేస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని కుక్కల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీపీఎఫ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి


సీపీఎఫ్ ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

గణపవరం: చేపలు, రొయ్యల మేతల తయారీ సంస్థ సీపీఎఫ్ కంపెనీలో పర్మినెంట్ ఉద్యోగులుగా పని చేస్తున్న తమకు న్యాయం చేయాలని కోరుతూ గణపవరం సీపీఎఫ్ ఫ్యాక్టరీ వద్ద ఉద్యోగులు ఆందోళనను కొనసాగిస్తున్నారు. శుక్రవారం 28వ రోజున కంపెనీలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులు కూడా ఆందోళనలో పాలుపంచుకున్నారు. దశాబ్ద కాలంగా లాభాల్లో నడుస్తున్న కంపెనీని అకారణంగా మూసివేసి కార్మికులు, ఉద్యోగుల పొట్ట కొట్టారని తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. తమ నియామకాల సమయంలో కంపెనీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఉద్యోగులను రోడ్డు మీదకు లాంగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్, కార్మికశాఖ అధికారులకు ఎన్ని వినతులు చేసినా ఫలితం లేదని వారు వాపోతున్నారు. ఇంత వరకూ యాజమాన్యంలో స్పందన లేదని, అధికార యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి తమకు న్యాయం చేయాలని కార్మికులు కోరుతున్నారు.

నాయీబ్రాహ్మణుల కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులు

భీమడోలు: గుండుగొలను నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. గ్రామంలోని నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ నందు నూతన కార్యవర్గ ఎన్నిక సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా కొక్కిరిపాటి నాగరాజు, ఉపాధ్యక్షుడిగా కట్టుంగ విశ్వనాథం, కార్యదర్శిగా తుమ్మలపూడి శ్రీనివాస్, కోశాధికారిగా అండలూరు శ్రీనివాసరావుతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో పలు అంశాలను చర్చించారు. సంఘం బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. నాయీ బ్రాహ్మణులు ఐక్యంగా ఉండి తమ సమస్యలను సాధించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు కొక్కిరిపాటి నాగ మాణిక్యాలరావు, పెద్దలు కె.రాంబాబు, కె.పెద్దిరాజు, తుమ్మలపూడి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

మేధా పాట్కర్‌పై శిక్షను రద్దు చేయాలి

ఏలూరు (టూటౌన్): ప్రముఖ పర్యావరణ వేత్త, నర్మదా బచావో నాయకురాలు మేధా పట్కర్ పైన ఢిల్లీ కోర్టు విధించిన శిక్ష, భారీ జరిమానాను రద్దు చేయాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మేధా పాట్కర్‌పై ఇటీవల ఢిల్లీ కోర్టు ఐదు నెలల జైలు శిక్ష, రూ.10 లక్షల భారీ జరిమానా విధిస్తూ తీర్పు నివ్వడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఈ తీర్పును ప్రజాస్వామిక వాదులు అందరూ తీవ్రంగా ఖండించాలని తెలిపారు. నర్మదా డ్యామ్‌లో మునిగిపోయే నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని, పెద్ద ఎత్తున ఆందోళన చేసిన ఫలితంగా పునరావాస సమస్యను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చర్చకు తీసుకురావడంతో మేధా పట్కర్ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఎవరో మెయిల్లో పంపించిన దానిపై ఆధారపడి గుజరాత్లో ఫైలైన కేసును ఢిల్లీకి మార్చుకుని 23 సంవత్సరాల తర్వాత ఆమెపై పైవిధంగా తీర్పు ఇవ్వడం బీజేపీ ఫాసిస్ట్ తరహా పాలనను తెలియజేస్తుందని వివరించారు. పునరావాసం కోసం గిరిజనులు, పేదల హక్కుల కోసం పోరాడే వారిపై కేసులు పెట్టడం, శిక్షలు విధించడం సరికాదని తెలిపారు. ప్రజాస్వామిక వాది అయిన అరుంధతి రాయ్‌పైనా 1400 పేజీల ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసు పెట్టడానికి బీజేపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు.

అవయవదానంపై రేపు సదస్సు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన మాతృదేవోభవ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన అవయవదానంపై నగరంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి పాల్గొంటారని పేర్కొన్నారు. స్థానిక పత్తేబాదలోని శ్రీసాయి రాధ మినీ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో రక్తదానం, నేత్రదానం, శరీర దానం, విద్యాదానం అనే అంశాలపై సైతం ఆమె అవగాహన కలిగిస్తారని తెలిపారు.

నేడు పెదవేగి మండల సర్వసభ్య సమావేశం

దెందులూరు: పెదవేగి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ తాతా రమ్యశ్రీ అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. ముఖ్య అతిథిగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ విచ్చేస్తారన్నారు. ఎంపీటీసీలు, జెడ్పీటీసీ అన్ని శాఖల మండల అధికారులు హాజరుకావాలని కోరారు.

పౌష్టికాహారం తప్పనిసరి


పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: మంచి ఆరోగ్యం కోసం ప్రతీ రోజూ తాజా కూరగాయలు, ఆకుకూరలతో కూడిన పౌష్టికాహారం తప్పని సరిగా తీసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. గణపవరం మండలం కాశిపాడులోని అంగన్‌వాడీ కేంద్రంలో విలేజ్ న్యూట్రీషన్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మహిళలు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు వైద్యుల సలహా మేరకు పోషకాలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు, ఐరన్ ఫోలిక్ మాత్రలు వంటివి వాడాలన్నారు. వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యకరమైన జీవనం సాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.